జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

సోమవారం | 10-08-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 750 పేజీలు: 4 వెల : రూ.7

## వైసీపీ నేత చింతాడ రవి కుమార్‌కు రిమాండ్





- జిల్లా జైలుకు తరలింపు
- రవికుమార్‌ను ఎస్పీ కార్యాలయం నుంచి కోర్టు వరకూ నడిపించుకొని తీసుకెళ్లిన పోలీసులు
- దీనిపై అభ్యంతరం చెప్పిన వైసీపీ శ్రేణులు
- కోర్టు దగ్గరలో ఉన్నందున తరలించి ఉంటారన్న కొందరి అభిప్రాయం
- ఇదే విషయం జిల్లావ్యాప్తంగా చర్చనీయాంశం

**శ్రీకాకుళం, ఆగస్టు 9 (వార్త):** మహిళా ఎస్ఐపై దాడి కేసులో వైసీపీ ఆమదాలవలస నియోజకవర్గ ఇంచార్జ్ చింతాడ రవికుమార్‌కు ఈ నెల 21వ తేదీ వరకు శ్రీకాకుళం కోర్టు రిమాండ్ విధించింది. అనంతరం రవికుమార్‌ను అంపోలులో గల జిల్లా జైలుకు పోలీసులు తరలించారు. రవికుమార్‌ను శనివారం చిలకపాలెం సమీపంలో అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. అక్కడనుంచి ఆయనను పాతపట్నం పోలీసు స్టేషన్‌కు తరలించారు. విచారణ అనంతరం ఆదివారం వైద్య పరీక్షలు నిర్వహించి శ్రీకాకుళం న్యాయస్థానంలో హాజరు పరచగా 13 రోజుల పాటు మేజిస్ట్రేట్ రిమాండ్ విధించారు. మహిళా ఎస్సై పట్ల అనుచిత ప్రవర్తన కేసులో 28 మందిపై నమోదవ్వగా శనివారం 9 మందిని అరెస్టు అయిన విషయం తెలిసిందే. ఈ కేసులో ఏ-1 గా ఉన్న చింతాడ రవికుమార్‌తో మరో ఇద్దరు ఆదివారం అరెస్టు అయ్యారు. ఇదిలా ఉండగా చింతాడను కోర్టుకు హాజరు పరిచే సమయంలో ఆయనను ఎస్సీ కార్యాలయం సమీపం నుంచి కోర్టుకు పోలీసులు నడిపించుకుంటు తీసుకెళ్లారు. దీనిపై వైసీపీ శ్రేణులు అసంతృప్తి వ్యక్తం చేశారు. పోలీసు వాహనంలో కాకుండా ఎందుకు నడిపించుకుంటూ తీసుకువెళుతున్నారంటూ కొందరు బాహటంగా విమర్శలు చేయగా, మరికొందరు ఆయనకు జేజేలు పలికారు. ఏదేమైనప్పటికీ ఈ అంశం జిల్లాలో చర్చనీయాంశమైంది.



## పెడంగోలో.. పిడుగు



- ఇద్దరు గిరిజన మహిళలు మృతి
- మరో నలుగురికి తీవ్ర గాయాలు
- హరిపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలింపు
- పాతకోట, పెడంగోలో విషాదఛాయలు
- ఆదివాసి దినోత్సవం రోజున ఘటన














**మందస, ఆగస్టు 9(వార్త):** ప్రకృతి పగ పట్టినట్టు తన ప్రతాపం చూపింది. అభం, శుభం తెలియని గిరిజనులపై జీవితాల్లో విషాదం నింపింది. మట్టి నమ్ముకుని, బతుకుతున్న వారి జీవితాలన పిడుగు కడతేర్చింది. ఒకే రోజున రెండు గ్రామాలకు చెందిన గిరిజన మహిళలు మరణించడంతో ఆయా కుటుంబాలు కన్నీరుమున్నీరుగా రోధిస్తున్నాయి. వివరాలిలా ఉన్నాయి. మందస మండలంలోని బుడారిసింగి పంచాయతీలో గల పెడంగో అనే గిరిజన గ్రామాల్లో ఖరీఫ్‌నకు సంబంధించిన వ్యవసాయ పనులు జరుగుతున్నాయి. ఈ పనులకు కూలీలు అవసరం కావడంతో పెడంగో, పాతకోట నుంచి గిరిజనులు, మహిళలు వచ్చారు. ఉదయం నుంచి పని చేస్తున్న వారికి మధ్యాహ్నం నుంచి మేఘావృతం కావడంతో వాతావరణం కాస్తా చల్లబడడంతో కూలీలకు ఉపశమనం దొరికింది. సాయంత్రం సరికి మెరుపులు, ఉరుములు, గర్జనలతో వర్షం పడింది. ఈ తరుణంలో పెడంగో పొలాల్లో గిరిజనులు పని చేస్తున్న ప్రదేశంలో పెద్ద శబ్దంతో పిడుగు పడింది. చెవులు పగిలేలా కలిగిన ఆ శబ్దానికి పని చేస్తున్న వారంతా కొద్దిసేపు తేరుకోలేకపోయారు. తెలివి వచ్చిన తర్వాత చూశాక, పెడంగో గ్రామానికి చెందిన కట్టా సముద్రి, పాతకోట గ్రామానికి చెందిన సవర జొర అచేతనంగా పడి ఉన్నారు. మరో నలుగురు కూడా గాయాలతో స్పృహ కోల్పోయారు. దీంతో 108 వాహనానికి సమాచారం అందించారు. దీంతో మందస 108 అంబులెన్స్ ఈఎంటీ మోహన్, పైలట్ సురేష్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సముద్రికి ప్రథమ చికిత్స అందివ్వడానికి వారు ప్రయత్నించగా.. అప్పటికే మరణించినట్టు గుర్తించారు. ఈలోగా తీవ్రంగా గాయపడిన మజ్జి దేవిక, కట్ట సుష్మిత, కుమార్ నీలావతి, బోయ కరిమిలను గిరిజనులు ఆసుపత్రికి తరలించమని కోరడంతో 108 సిబ్బంది హరిపురం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఈలోగా పిడుగు పాటుకు గురైన మరో మహిళ సవర జొర పరిస్థితి కూడా విషమించడంలో ఆమె కూడా మరణించింది. కట్టా సముద్రి, సవర జొర అనే ఇద్దరు గిరిజన మహిళలు పిడుగు పాటుకు మరణించడంతో పెడంగో, పాతకోటలలో విషాదఛాయలు అలముకున్నాయి. తీవ్రంగా గాయపడిన నలుగురు గిరిజన మహిళలు చికిత్స పొందుతున్నారు. కాగా, ప్రపంచ ఆదివాసీ దినోత్సవం రోజునే ఈ సంఘటన జరిగి, గిరిజన కుటుంబాల్లో విషాదం నింపడంతో గిరిజనులు కన్నీటి పర్యవంతమవుతున్నారు.

### పిడుగుపాటు ఘటనపై మంత్రి అచ్చెన్న దిగ్భ్రాంతి

మందస మండల పరిధిలోని ఏజెన్సీ ప్రాంతమైన పాతకోటలో పిడుగుపడి ఇద్దరు మహిళలు మృతి చెందడం అత్యంత బాధాకరమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పిడుగుపాటు ఘటనలో సుమిద్రి, జోరా అనే ఇద్దరు మహిళలు మృతి చెందడం పట్ల మంత్రి విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ విషాద సమయంలో బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. అదేవిధంగా పిడుగుపాటు ఘటనలో మరో నలుగురు గాయపడటం పట్ల మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. గాయపడిన వారికి హరిపురం ప్రభుత్వ ఆసుపత్రిలో అందుతున్న వైద్య చికిత్సపై అధికారులను ఆరా తీశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు, సంబంధిత అధికారులకు మంత్రి సూచించారు. గాయపడిన వారి ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, అవసరమైన వైద్య సహాయాన్ని తక్షణమే అందించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. బాధిత కుటుంబాలకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందించాలని సూచించారు.



## నర్తు వెంకటరమణ కుటుంబానికి ఆర్థిక సహాయం

**మందస, ఆగస్టు 9(వార్త):** మందస మండలంలోని లొహరిబంద గ్రామానికి చెందిన నర్తు వెంకటరమణ రోడ్డు ప్రమాదంలో మరణించారు. వెంకటరమణది నిరుపేద కుటుంబం. దీంతో దాతలు సాయమందిస్తున్నారు. లొహరిబంద గ్రామంలో 2004–2005 విద్యా సంవత్సరంలో చదువుకున్న పూర్వ విద్యార్థులు తమ వంతు సహాయంగా 10,000 రూపాయలను ఆర్థిక సహాయంగా అందజేశారు. వెంకటరమణ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న సమయంలో కూడా సాయమందించారు. వీరు స్వతహాగా చాలా మంది సహాయం చేస్తుంటారు. కార్యక్రమంలో అందాల భీమరావు, అందాల నెహ్రూ, గౌరకల ధర్మారావు, గౌరకల పాపారావు పాల్గొన్నారు.

## విశ్వహిందూ పరిషత్ ప్రఖండ అభ్యాస వర్గ సమ్మేళనం




**ఇచ్ఛాపురం ఆగస్టు 9 (వార్త):** విశ్వ హిందూ పరిషత్ ప్రఖండ అబ్యాస వర్గ సమ్మేళనాన్ని స్థానిక త్రినాధ స్వామి ఆలయం శివానందగిరి కొండపైన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు రావి రాంప్రసాద్ మాస్టర్, ప్రఖండ అధ్యక్షులు పాక తులసీదాసు, ప్రఖండ ప్రధాన కార్యదర్శి సదాశివుని శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షులు లోకనాదం ఆనందరావు, ప్రాంత సేవ ప్రముఖ గుంటుకు సాయిరాం, రెండు జిల్లాలకు విభాగ్ కార్యదర్శి నాగభూషణం, ముఖ్యఅతిథిగా ఎన్ విశ్వనాద్ లు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ సభ్యులు ఉల్లాశి శ్యామ్ కుమార్, లోపింటి సత్యం, గోపి, ఆశీ జగన్ మోహన్ రెడ్డి, రావి విజయలక్ష్మి, రావి జయకృష్ణ, తడక కాళిదాసు, మురళి గోపాలకృష్ణ, మాటూరి సూర్యం, ఉప్పాడ రాజా, ధనపానమోహన్, కణిదల దుర్యోధన, కాదా వెంకటరమణ, గణేష్ స్వామి, నందిక వెంకట్రావు, చిన్నాల వెంకటరమణ, ఢిల్లీ రావు మాస్టారు, శ్రీహరి సత్యానంద్ ఇచ్ఛాపురం కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

### ఉపాధి హామీ పనుల్లో

## అవినీతిపై విచారణ జరపాలి

### ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర నాయకులు, నాయుడుగారి రాజశేఖర్



**జలుమూరు, ఆగస్టు 9 (వార్త):** జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలులో శ్రీముఖలింగం గ్రామంలో అవకతవకలు జరుగుతున్నాయనే ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలని ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర నాయకులు, నాయుడుగారి రాజశేఖర్ డిమాండ్ చేశారు. శుక్రవారం శ్రీముఖలింగంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ ఆధ్వర్యంలో 2005లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ప్రారంభమై 21 సంవత్సరాలు పూర్తయిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పనతో పాటు మౌలిక వసతుల అభివృద్ధికి ఈ పథకం కీలకంగా మారిందని పేర్కొన్నారు. అయితే స్థానిక రాజకీయ నాయకులు, సంబంధిత అధికారులు, ఫీల్డ్ అసిస్టెంట్ల స్థాయిలో జరుగుతున్న అవినీతి కారణంగా పథకం ఆశించిన స్థాయిలో అమలు కావడం లేదని రాజశేఖర్ ఆరోపించారు. శ్రీముఖలింగం గ్రామంలో గత 21 సంవత్సరాల్లో సుమారు రూ.15 కోట్ల మేర ఉపాధి హామీ పనులు జరిగినట్లు చెబుతున్నప్పటికీ, నిర్మించిన చెరువులు, కాలువలు, నదీ స్నాన ఘట్టాలు తదితర పనుల్లో అనేకం పూర్తి స్థాయిలో కనిపించడం లేదని అన్నారు. పథకం కింద మంజూరైన నిధులు, చేపట్టిన పనులు, పనుల పురోగతి, కూలీల హాజరు, చెల్లింపులు తదితర అంశాలపై అధికారులు సమగ్రంగా పరిశీలించాలని ఆయన కోరారు. పనులు జరగకుండా కూలీల పేర్లపై చెల్లింపులు జరిగాయా? నిధుల వినియోగంలో ఎలాంటి అవకతవకలు చోటుచేసుకున్నాయి? అనే అంశాలపై విచారణ జరపాల్సిన అవసరం ఉందన్నారు. శ్రీముఖలింగంలో ఉపాధి హామీ పథకం అమలుపై గ్రామస్థులు ప్రశ్నించాల్సిన సమయం ఆసన్నమైందని రాజశేఖర్ అన్నారు. పథకం కింద జరిగిన పనులపై పూర్తి వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలని, సామాజిక తనిఖీలు సమర్థవంతంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకంలో అవినీతికి సంబంధించిన ఆధారాలను సేకరించి విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు ఫిర్యాదు చేసి సమర్పిస్తామని ఆయన తెలిపారు. బాధ్యులెవరైనా చట్టపరమైన చర్యలు తీసుకునేలా అధికార యంత్రాంగం చర్యలు చేపట్టాలని కోరారు. గ్రామ అభివృద్ధికి ఉద్దేశించిన ప్రభుత్వ నిధులు సక్రమంగా వినియోగించబడేలా గ్రామస్థులు, మేధావులు, ప్రజాప్రతినిధులు పర్యవేక్షించాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజల భాగస్వామ్యంతోనే ప్రభుత్వ పథకాల్లో పారదర్శకత సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

## స్నేహిత' ఆధ్వర్యంలో బెంచీల ఏర్పాటు

**కవిటి, ఆగస్టు 9 (వార్త):** దూగానపుట్టుగ గ్రామంలో స్థానిక స్నేహిత ఫౌండేషన్ సౌజన్యంతో పలువురు దాతల సహకారంతో అదే గ్రామంలో గల పెద్ద తాత సన్నిధానం ఆవరణలో 12 సిమెంట్ బెంచీలను ఏర్పాటు చేశారు. గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు ఎంతో భక్తిశ్రద్ధలతో కొలిచ పెద్ద తాత సన్నిధి వద్ద నిరంతరం భక్తులు తాకిడి అధికంగా ఉంటుంది. అభివృద్ధిలో భాగంగా బెంచీలను ఏర్పాటు చేయడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఫౌండేషన్ ప్రతినిధులు బంజు మనోజ్, దూగాన దివాకర్, సిసింద్రీ, జ్ఞాని, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



# ఆదివాసీల అభ్యున్నతికి ప్రత్యేక శ్రద్ధ

**✻ జిల్లా కలెక్టర్ స్వప్నికల్ దినకర్ పుండ్కర్**
**✻ పలాసలో ఘనంగా ఆదివాసి దినోత్సవ వేడుకలు**




**పలాస, ఆగస్టు 9 (వార్త):** ఆదివాసీ అభ్యున్నతే లక్ష్యంగా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో చర్యలు చేపడుతుందని జిల్లా కలెక్టర్ స్వప్నికల్ దినకర్ పుండ్కర్ అన్నారు. స్థానిక రైల్వే మైదానంలో ఆదివారం సీతం పేట ఐ టి డి ఎ ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసి దినోత్సవ వేడుకల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్, స్థానిక శాసనసభ్యులు గౌతు శిరీష ముఖ్య అతిథిలుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భోగాపురం గ్రీన్‌ఫీల్డ్ అంతర్జాతీయ విమానాశ్రయానికి అల్లూరి సీతారామరాజు పేరు పెట్టడం ద్వారా ప్రభుత్వం గిరిజనుల గౌరవాన్ని మరింత పెంచిందని తెలిపారు. జిల్లాలోని 16 మండలాల పరిధిలో సుమారు 90 వేల మంది సవర గిరిజనులు నివసిస్తున్నారని, వీరందరికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాయని తెలిపారు. ఐటీడీఏ పరిధిలో 268 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా, సుమారు 20 వేల మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారని పేర్కొన్నారు. ఇటీవల పరీక్షా ఫలితాల్లో ఐటీడీఏ పరిధిలోని పాఠశాలలు 94.77 శాతం ఉత్తీర్ణత సాధించాయని, జిల్లా సగటు ఉత్తీర్ణత 90.5 శాతంగా ఉందన్నారు. జిల్లా సగటు కంటే అధికంగా ఉత్తీర్ణత సాధించడంతో పాటు గిరిజన విద్యార్థులు విద్యలో ప్రతిభ కనబరచడం సంతోషకరమని తెలిపారు. గిరిజనుల ఆరోగ్య భద్రతకు చర్యలుగిరిజన ప్రాంతాల్లో సికిల్ సెల్ ఎనీమియా, తలసేమియా వంటి వ్యాధుల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరికీ ఆరోగ్య కార్డులు పంపిణీ చేసి, గిరిజనుల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.

### రూ.198 కోట్లతో రహదారుల అభివృద్ధి...

గత రెండు సంవత్సరాల్లో గిరిజన ప్రాంతాల్లో 291 గ్రామాల్లో 249 గ్రామాలకు వి బీ జీ రామ్ జీ, నాబార్డ్ నిధులు సుమారు రూ.198 కోట్ల వ్యయంతో రహదారి సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. ఇప్పటివరకు రహదారి సౌకర్యం లేని, డోలీపై ఆధారపడుతున్న గ్రామాలకు కూడా రహదారులు నిర్మించేందుకు చర్యలు చేపట్టామని వెల్లడించారు. గిరిజనులకు భూ హక్కులుఅటవీ హక్కుల చట్టం కింద సుమారు 163 ఎకరాల భూమిని గిరిజన లబ్ధిదారులకు పంపిణీ చేసినట్లు తెలిపారు.

### గిరిజన ఉత్పత్తులకు 'అమోఘం'..

బ్రాండ్‌వీడీవీకేలు, డ్వాక్రా మహిళలు తయారు చేస్తున్న గిరిజన ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించేందుకు ఐటీడీఏ బ్రాండ్ అయిన 'అమోఘం' కార్యక్రమం ద్వారా ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. గిరిజనుల ఉత్పత్తులకు విస్తృత మార్కెట్ కల్పించి, వారి ఆదాయాన్ని పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. పాతపట్నం, పలాస, మందస ప్రాంతాల్లో గిరిజన విద్యార్థుల కోసం మల్టీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అదేవిధంగా గిరిజన ప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు ట్రెక్కింగ్ మార్గాల ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు వెల్లడించారు. గిరిజన ప్రాంతాల్లోని ప్రకృతి వనరులను పర్యాటకంగా అభివృద్ధి చేయడం ద్వారా స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

### ప్రత్యేక గ్రీవెన్స్ సెల్

గిరిజనుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు జిల్లా స్థాయిలో, అలాగే పాతపట్నం వద్ద ప్రత్యేక గ్రీవెన్స్ సెల్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గిరిజనులు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం పొందేలా ఈ వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు. గిరిజనుల విద్య, వైద్యం, రహదారులు, భూ హక్కులు, ఉపాధి, క్రీడలు, పర్యాటకం తదితర రంగాల్లో సమగ్ర అభివృద్ధి సాధించే దిశగా ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యతతో చర్యలు చేపడుతోందని తెలిపారు. శాసనసభ్యులు గౌతు శిరీష మాట్లాడుతూ ప్రభుత్వానికి వెన్నుదన్నుగా నిలిచిన గిరిజనుల అభివృద్ధికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధికి చర్యలు చేపడుతున్నారన్నారు. ఆదివాసి దినోత్సవం సందర్భంగా అందరికి అభినందనలు తెలియజేశారు. అనంతరం 200 మంది ఆశ్రమ పాఠశాల విద్యార్థినిలు ప్రదర్శించిన దింసా నృత్యాలు, సాంప్రదాయ సాంస్కృత కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. అంతకుముందు ఆదివాసీలు నిర్వహించిన ర్యాలీ కోలాహలంగా సాగింది. ఆదివాసి దినోత్సవం సందర్భంగా టెక్కలి జిల్లా ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని కలెక్టర్ సందర్శించారు. రక్తదానం చేసేందుకు వచ్చిన యువతను ప్రత్యేకంగా అభినందించారు. ప్రశంసా పత్రాలను కలెక్టర్ చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు విఠల్, మాజీ మున్సిపల్ ఛైర్మన్ వజ్జ బాబూ రావు, డిఆర్డిఏ పథక సంచాలకులు ఎన్ .కిరణ్ కుమార్, రెవెన్యూ డివిజనల్ అధికారి ఆర్.అప్పల రాజు, ఐ టి డి ఎ సహాయ ప్రాజెక్ట్ అధికారి చిన్నబాబు, డి డి. అన్నా దొర, డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్ పి.నాయుడు, గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ అధికారి రమాదేవి, మున్సిపల్ కమీషనర్ శ్రీనివాస్ రావు, తాసిల్దార్ బెలమాన శ్రీదేవి, ఎంపీడీఓ వసంత ప్రసాద్, డా,సునీత, గిరిజన సంఘ నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# గిరిజనుల అభివృద్ధి.. కూటమి ప్రభుత్వం లక్ష్యం




**✻ ఎమ్మెల్యే గౌతు శిరీష ✻ సంప్రదాయ నృత్యాలతో కదం తొక్కిన గిరిజనులు**
**✻ పలాసలో భారీ ర్యాలీ ✻ థింసా నృత్యాలతో అలరించిన కళాకారులు**

**పలాస, ఆగస్టు 9 (వార్త):** గిరిజనుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష స్పష్టం చేశారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలు పలాసలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. గిరిజనులు సంప్రదాయ దుస్తులు ధరించి, వాయిద్యాలు మోగిస్తూ, నృత్యాలు చేస్తూ ఉత్సాహంగా పాల్గొన్నారు. పట్టణంలోని కేటీ రోడ్డు మీదుగా నిర్వహించిన భారీ ర్యాలీ ఆద్యంతం సందడిగా సాగింది. సంప్రదాయ వాయిద్యాల మోత, కళాకారుల నృత్యాలతో ప్రధాన రహదారులు మార్మోగాయి. గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు, కళారూపాలను ప్రతిబింబించేలా ర్యాలీని నిర్వహించారు. యువత, మహిళలు, పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సంస్కృతిని చాటిచెప్పారు. పలువురు సంప్రదాయ వేషధారణలో ఆకట్టుకున్నారు. థింశా నృత్యం ప్రత్యేక ఆకర్షణర్యాలీ అనంతరం పలాస రైల్వే గ్రౌండ్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించారు. జిల్లా కలెక్టర్, పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గిరిజనుల సంప్రదాయాలు, సంస్కృతి, కళలను ప్రతిబింబించేలా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సుమారు 200 మంది గిరిజన కళాకారులు ప్రదర్శించిన థింసా నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సంప్రదాయ వాయిద్యాల నడుమ కళాకారులు చేసిన నృత్య ప్రదర్శన సభకు హాజరైన వారిని విశేషంగా ఆకట్టుకుంది. గిరిజనుల కళా సంపదను కాపాడుకోవాల్సిన అవసరాన్ని ఈ కార్యక్రమం చాటిచెప్పింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గిరిజనుల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని, గిరిజన ప్రాంతాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన, విద్య, వైద్యం, రహదారులు, తాగునీరు తదితర అంశాలపై ప్రభుత్వం దృష్టి సారించిందని తెలిపారు. గిరిజనుల సంక్షేమం, జీవన ప్రమాణాల మెరుగుదలకు ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని చెప్పారు. గిరిజన ప్రాంతాల్లో అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలను దశలవారీగా చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలు, కళారూపాలు దేశ సాంస్కృతిక వైవిధ్యానికి ప్రతీకలని, వాటిని భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. గిరిజనుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన భారీ ర్యాలీ, సాంస్కృతిక కార్యక్రమాలు పలాసలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సంప్రదాయ దుస్తులు, వాయిద్యాలు, నృత్యాలతో గిరిజనులు తమ సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని చాటిచెప్పారు. కార్యక్రమం ముగింపు వరకు ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది. వేడుకల్లో గిరిజన సంక్షేమ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ గిరిజన సంఘాల ప్రతినిధులు, కళాకారులు, మహిళలు, యువత, గిరిజనులు పాల్గొన్నారు.

## గిరిజనులకు ఉచిత న్యాయ సేవలు




**పలాస, ఆగస్టు 9 (వార్త):** గిరిజనులకు తమ ప్రాంతాల్లోని సహజ వనరులను పరిరక్షించుకునే హక్కులు ఉన్నాయని, వారికి ఉచిత న్యాయ సేవలు అందిస్తామని వక్తలు అన్నారు. ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని పలాస మండలం లొత్తూరు గ్రామంలో ఆదివారం ప్రత్యేక న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లోని భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడుకోవాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనుల కోసం అమలు చేస్తున్న ఉచిత విద్య, వైద్యం, సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గిరిజనులకు న్యాయ సేవల ప్రాధికార చట్టం ప్రకారం ఉచిత న్యాయ సహాయం అందు బాటులో ఉందని వివరించారు. న్యాయపరమైన సమస్యలు ఎదురైనప్పుడు పలాసలోని మండల న్యాయ సేవా సంఘాన్ని సంప్రదించవచ్చని, అలాగే 15100 ఉచిత న్యాయ సేవల టోల్‌ఫ్రీ నంబర్ ద్వారా సహాయం పొందవచ్చని తెలిపారు. కోర్టుల్లో కేసులు దాఖలు చేయాల్సిన పరిస్థితుల్లో అర్హులైన గిరిజనులకు ఉచితంగా న్యాయవాదిని కూడా మండల న్యాయ సేవా సంఘం ద్వారా ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. యువత విద్యపై ప్రత్యేక దృష్టి సారించాలని వక్తలు సూచించారు. ఉన్నత విద్య కోసం ప్రభుత్వం అందిస్తున్న వివిధ పథకాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ముఖ్య అతిథులుగా పలాస న్యాయవాదుల సంఘం ఉపాధ్యక్షుడు బి. కామేశ్వరరావు పట్నాయక్, ప్యానల్ న్యాయవాది డాక్టర్ కే. లోకేశ్వరరావు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కాశీబుగ్గ పోలీస్ సిబ్బంది, గ్రామ సెక్రటరీ రాజ్‌కుమార్, స్థానిక సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీ, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## బోన్ మారో బాధితునికి రక్తదానం




**సోంపేట, ఆగస్టు 9 (వార్త):** కంచిలి మండలం బూరగాం గ్రామానికి చెందిన దూపాన మాధవరావు అనే యువకుడు కొన్ని నెలలుగా బోన్మారో వ్యాధితో బాధపడుతున్నాడు. తీవ్ర సమస్యతో కూడిన ఈ వ్యాధి చికిత్సకు పెద్ద మొత్తంలో ఖర్చుతోపాటు రక్తం కూడా అధిక మొత్తంలో అవసరం ఉంటుంది. ఈ పరిస్థితుల్లో బాధితులు సోంపేటకు చెందిన ఎస్ ఎస్ సేవా ఫౌండేషన్ కు సంప్రదించడంతో సంస్థ అధ్యక్షుడు మాజీ రోటరీ క్లబ్ అధ్యక్షుడు దుద్ది శ్రీనివాసరావు వెంటనే ఒక యువకుడి ద్వారా ఏ పాజిటివ్ రక్తాన్ని అందజేశారు. సోంపేట కు చెందిన గుంటుకు బెనర్జీ 16వసారి రక్తదానం చేసి మాధవరావు కు అండగా నిలవడంతో బెనర్జీని ఎస్ ఎస్ సేవా ఫౌండేషన్ అభినందించింది.

## శిథిలావస్థలో గ్రంథాలయం

**నరసన్నపేట, ఆగస్టు 9(వార్త):** నరసన్నపేట మేజర్ పంచాయతీ ఆధ్వర్యంలో కొన్ని దశాబ్దాలుగా నిర్వహిస్తున్న నాగేశ్వర గ్రంథాలయం ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకోవడంతో పాఠకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒకప్పుడు వందలాది మంది ఉదయం, సాయంత్రం వేళల్లో గ్రంథాలయానికి వచ్చి పుస్తకాలు చదువుతూ విజ్ఞానాన్ని పెంపొందించుకునేవారు. ప్రస్తుతం భవనం పరిస్థితి అధ్వానంగా మారడంతో ఆ సందడి పూర్తిగా తగ్గిపోయింది. ముఖ్యంగా గ్రంథాలయ భవనం పైకప్పు పూర్తిగా దెబ్బతిని శిథిలావస్థకు చేరుకోవడంతో లోపలికి వెళ్లేందుకు పాఠకులు భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. భవనం ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ఆందోళన వ్యక్తమవుతోంది. దీంతో పాఠకులు గ్రంథాలయాన్ని వినియోగించుకోలేక పోతున్నారు. పట్టణంలో ఎంతోకాలంగా విద్యార్థులు, ఉద్యోగార్థులు, పుస్తక ప్రియులకు ఉపయోగపడుతున్న నాగేశ్వర గ్రంథాలయం ప్రస్తుతం నిర్లక్ష్యానికి గురికావడం పట్ల స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రంథాలయ భవనానికి మరమ్మతులు చేపట్టి పునరుద్ధరిస్తే విద్యార్థులు, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులు, పుస్తక పఠనాన్ని ఇష్టపడే వారికి ఎంతో ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు. అధికారులు వెంటనే గ్రంథాలయ భవనాన్ని పరిశీలించి అవసరమైన నిధులు కేటాయించి పైకప్పుతో పాటు భవనం మొత్తానికి మరమ్మతులు చేపట్టాలని పాఠకులు, స్థానికులు కోరుతున్నారు. పాత గ్రంథాలయానికి పూర్వ వైభవం తీసుకువచ్చి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# ఆదివాసీల హక్కులను హరిస్తే ఉద్యమిస్తాం

**✻ చట్టాల పరిరక్షణకు గళమెత్తాలి**
**✻ ఆదివాసీ హక్కుల పరిరక్షణకు ఐక్య పోరాటం**
**✻ పౌర హక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి పత్రి దానేష్ ✻ బొడ్డపాడులో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం**


**పలాస, ఆగస్టు 9 (వార్త):** దశాబ్దాలుగా ఆదివాసీలపై కొనసాగుతున్న నిర్లక్ష్యపు విధానాలకు వ్యతిరేకంగా ప్రజలంతా ఐక్యంగా పోరాడాలని పౌర హక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి పత్రి దానేష్ పిలుపునిచ్చారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఆదివారం పలాస మండలం బొడ్డపాడులోని అమరవీరుల స్మారక భవనంలో పౌర హక్కుల సంఘం ఆధ్వర్యంలో కరపత్ర ఆవిష్కరణ, రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దానేష్ మాట్లాడుతూ దేశంలో ఆదివాసీలు తమ హక్కుల కోసం స్వాతంత్ర్యానికి పూర్వం బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగాను, అనంతరం వివిధ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగాను అనేక పోరాటాలు చేశారని పేర్కొన్నారు. ఆ పోరాటాల ఫలితంగా సాధించుకున్న హక్కులు, చట్టాలను ప్రస్తుత పాలకులు నిర్వీర్యం చేసే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. చట్టాలను నిర్వీర్యం చేసే ప్రయత్నాలు మానుకొని, ఆదివాసీలు నివసించే ప్రాంతాల్లోని సహజ వనరులను కార్పొరేట్ సంస్థలకు అప్పగించే విధానాలు కొనసాగుతున్నాయని వక్తలు విమర్శించారు. రాజ్యాంగంలోని ఐదో, ఆరో షెడ్యూళ్లను పరిరక్షించడంతో పాటు ఆదివాసీల భూమి, హక్కులకు రక్షణ కల్పించే చట్టాలను పటిష్ఠంగా అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఆదివాసీల పోరాటాల ద్వారా సాధించుకున్న 1/70 చట్టాన్ని బలహీనపరిచే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఇలాంటి విధానాల వల్ల భవిష్యత్తులో ఆదివాసీలు తమ భూముల నుంచి నిర్వాసితులయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివాసీల 'జల్–జంగల్–జమీన్' హక్కులను పరిరక్షించేందుకు ప్రజలంతా గళమెత్తాలని పిలుపునిచ్చారు. ఆదివాసీ సమాజం, వారి సంస్కృతి, సంప్రదాయాలు కనుమరుగయ్యే పరిస్థితులు రాకుండా చూడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. జిల్లాలో ఐటీడీఏ ఏర్పాటు చేయాలని, జిల్లాలోని ఆదివాసీ గ్రామాలన్నింటినీ ఏజెన్సీ పరిధిలోకి తీసుకురావాలని, 1/70 చట్టాన్ని సమర్థంగా అమలు చేయాలని వక్తలు డిమాండ్ చేశారు. పలువురు ప్రజా సంఘాల ప్రతినిధులు హాజరురౌండ్‌టేబుల్ సమావేశంలో పౌర హక్కుల సంఘం జిల్లా కమిటీ సభ్యులు సోమనాదం, వైకుంఠరావు, జోగారావు, లక్ష్మణరావు, డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ గౌరవాధ్యక్షుడు కోత ధర్మారావు, ప్రగతిశీల కార్మిక సమాఖ్య ప్రతినిధులు మద్దెల ధర్మాల, పచ్చ దుర్యోధన, అమరవీరుల బంధుమిత్రుల సంఘం జిల్లా బాధ్యులు జోగు కోదండరావు, తామాడ త్రిలోచన, దేశభక్తి ప్రజాతంత్ర ఉద్యమం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శాలిని, వీరాస్వామి, లక్ష్మణులు, బుడత బాలరాజు, స్వేచ్ఛ మహిళా సంఘం అధ్యక్షురాలు నాగమణి తదితరులు పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# ఆపదలో ఉన్న ప్రతి కుటుంబానికి అండగా సీఎంఆర్ఎఫ్

**❋ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**
**❋ టెక్కలి నియోజకవర్గంలో 441 మందికి రూ.4.83 కోట్ల ఆర్థిక సాయం**
**❋ 44 మంది లబ్ధిదారులకు రూ.22.83 లక్షల విలువైన చెక్కుల పంపిణీ**



**కోటబొమ్మాళి/సంతబొమ్మాళి, ఆగస్టు 9 (వార్త):** ఆపదలో ఉన్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) భరోసాగా నిలుస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. అనారోగ్యంతో సొంత ఖర్చులతో వైద్యం చేయించుకున్న అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.కోటబొమ్మాళి మండలం ఎన్టీఆర్ భవన్‌లో ఆదివారం నాలుగు మండలాల పరిధిలోని సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు మంత్రి అచ్చెన్నాయుడు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా 44 మంది లబ్ధిదారులకు రూ. 22,83,053 విలువైన ఆర్థిక సహాయాన్ని అందజేశారు.తమ కార్యాలయానికి ఇప్పటివరకు 557 సీఎంఆర్ఎఫ్ దరఖాస్తులు అందగా, వాటిలో 441 మంది లబ్ధిదారులకురూ. 4,83,30,503 మేర ఆర్థిక సహాయం మంజూరైనట్లు మంత్రి తెలిపారు. ప్రస్తుతం పరిశీలనలో ఉన్న మిగిలిన దరఖాస్తులను కూడా త్వరితగతిన పరిష్కరించి అర్హులైన వారికి ముఖ్యమంత్రి సహాయనిధి అందేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.ప్రతి ఎకరాకు సాగునీరు.. ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరుటెక్కలి నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. ప్రతి ఎకరాకు సాగునీరు, ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని చెప్పారు.తాగునీటి ప్రాజెక్టుల కోసం సుమారు రూ. 640 కోట్ల నిధులు మంజూరయ్యాయని, ఈ నెల 18న టెండర్ల ప్రక్రియ పూర్తయిన వెంటనే పెద్దఎత్తున పనులకు శంకుస్థాపనలు చేపడతామని తెలిపారు. ఏడాదిన్నర వ్యవధిలో హిరమండలం రిజర్వాయర్ నుంచి ప్రతి గ్రామానికి, ప్రతి ఇంటికి కొలాయిల ద్వారా స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు.నేరడి బ్యారేజీతో వంశధార జలాలకు కొత్త భరోసాదశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న వంశధార-- నేరడి బ్యారేజీ సమస్యకు పరిష్కారం లభించిందని మంత్రి తెలిపారు. 19 టీఎంసీల నీటిని నిల్వ చేసే వంశధార రిజర్వాయర్‌కు నేరడి బ్యారేజీ అత్యంత కీలకమని పేర్కొన్నారు.ఒడిశాతో సుమారు ఆరు దశాబ్దాలుగా కొనసాగుతున్న సమస్యను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ప్రత్యేక చొరవతో పరిష్కరించారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయించడంతో మార్గం సుగమమైందన్నారు. నేరడి బ్యారేజీ నిర్మాణానికి సంబంధించి అంచనాల రూపకల్పన పనులను అధికారులు వేగవంతం చేశారని చెప్పారు.గ్రామీణ రహదారుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యతనియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల్లో మట్టి రోడ్లకు స్వస్తి పలికి సిమెంట్, తారు రోడ్ల నిర్మాణాన్ని పెద్దఎత్తున చేపట్టామని మంత్రి తెలిపారు. ఇప్పటికే సుమారు 80 శాతం రహదారి పనులు పూర్తయ్యాయని, మిగిలిన 20 శాతం పనులను పూర్తి చేసేందుకు మరో రూ. 350 కోట్ల నిధులు మంజూరు చేశామని వెల్లడించారు.సంక్షేమం అభివృద్ధి సమాంతరంగాఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన 'సూపర్ సిక్స్' హామీలతో పాటు వివిధ సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తూ ప్రజలకు ఇచ్చిన హామీల్లో 99 శాతం మేర నెరవేర్చామని తెలిపారు.సామాజిక భద్రతా పింఛన్‌ను రూ. 3 వేల నుంచి రూ. 4 వేలకు పెంచడంతో పాటు, 'అన్నదాత సుఖీభవ' కింద రైతులకు రూ. 20 వేల ఆర్థిక సాయం అందిస్తున్నామని చెప్పారు. మహిళలకు ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం, మత్స్యకారులకు ఉపాధి భృతి వంటి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామనివివరించారు. మత్స్యకారుల సంక్షేమానికి ప్రత్యేకంగా రూ. 5 లక్షల ప్రమాద బీమా పథకాన్ని అమల్లోకి తీసుకొచ్చామని, ప్రమాదవశాత్తు మత్స్యకారుడు మరణించిన సందర్భంలో యాప్‌లో నమోదు చేసుకున్న కుటుంబానికి 24 గంటల్లోనే ఆర్థిక సహాయం అందేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివర ప్రసాద్ , తదితరులు ,పాల్గొన్నారు.

## పోటీ పరీక్షల పుస్తకం ఆవిష్కరణ

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) నిర్వహించే గ్రూప్-1, గ్రూప్-2తో పాటు వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువత కోసం ప్రత్యేకంగా రూపొందించిన 'శాస్త్ర సాంకేతిక విజ్ఞానం - పర్యావరణం' పుస్తకాన్ని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదివారం కోటబొమ్మాళి ఎన్టీఆర్ భవన్ వద్ద ఆవిష్కరించారు. ఆర్.ఎస్. రెడ్డి ప్రచురణ సంస్థ ఆధ్వర్యంలో ఈ పుస్తకం రూపుదిద్దుకుంది. ?ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పోటీ పరీక్షల్లో కీలకంగా మారిన శాస్త్ర సాంకేతికత, పర్యావరణ అంశాలపై అభ్యర్థులకు సమగ్ర అవగాహన కల్పించేలా, సులభంగా అర్థమయ్యే రీతిలో ఈ స్టడీ మెటీరియల్‌ను అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని పేర్కొన్నారు. పరీక్షల సన్నద్ధతకు, పునశ్చరణకు ఈ పుస్తకం ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని నాణ్యమైన అధ్యయన సామగ్రిని అందించిన రచయితల బృందాన్ని ఆయన అభినందించారు.



## పలాస పురవీధుల్లో 'ప్రేమ ప్రవాహిని' ఊరేగింపు

**పలాస, ఆగస్టు 9 (వార్త):** పుట్టపర్తి నుంచి విచ్చేసిన సత్యసాయి ప్రేమ ప్రవాహిని రథానికి పలాసలో భక్తులు ఆదివారం ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పట్టణ పురవీధుల్లో మహా నగర సంకీర్తనను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సత్యసాయి నామస్మరణతో పలాస పురవీధులు మార్మోగాయి. సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని భజనలు, సంకీర్తనలతో రథాన్ని అనుసరించారు. ఆధ్యాత్మిక వాతావరణంలో సాగిన నగర సంకీర్తన భక్తులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా సాయి భక్తులు మాట్లాడుతూ అందరినీ సేవించు.. అందరినీ ప్రేమించు మానవత్వమే జీవితానికి అసలైన విలువని, సమాజంలో ప్రతి ఒక్కరికీ తనవంతు సహాయం అందిస్తూ, ఎలాంటి భేదాభిప్రాయాలు లేకుండా ప్రేమ, దయ, సహనంతో మెలగాలని సూచించారు. మనిషి గొప్పతనం సంపద, హోదాల్లో కాకుండా అతని హృదయంలో, సేవాభావంలో ఉంటుందని తెలిపారు. అవసరాల్లో ఉన్నవారికి అండగా నిలవడం, తోటి మనుషుల పట్ల ఆప్యాయత చూపడం ద్వారా మానవత్వాన్ని చాటుకోవచ్చన్నారు.సేవాభావం, ప్రేమ, దయ, సహనం వంటి విలువలను జీవితంలో భాగం చేసుకుంటే సమాజంలో సానుకూల వాతావరణం ఏర్పడుతుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఇతరుల పట్ల బాధ్యతతో వ్యవహరించడమే ఈ సందేశం యొక్క ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలాస సమితి కన్వీనర్ ఇప్పిలి తిరుమల, జోనల్ కన్వీనర్ బైరాగి మాస్టర్, శ్రీకాకుళం జిల్లా ప్రతినిధులు జె.సి.హెచ్. శ్రీనివాసరావు, కాశం శ్రీనివాసరావు, లలిత, సుజాత, లత పాల్గొన్నారు.

## ఆరకబద్ర వంతెనకి రక్షణ కవచం నిర్మించండి



**ఇచ్ఛాపురం, ఆగస్టు 9 (వార్త):** అరకభద్ర గ్రామానికి సమీపంలో బహుదా నదిపై గత వైస్సార్సీపీ ప్రభుత్వంలో 14 కోట్ల వ్యయంతో వంతెన నిర్మాణం పూర్తి చేసిందని, సార్వత్రిక ఎన్నికలు ముందు కోడ్ అమలు వలన వంతెనకు ఇరువైపులా టోయ్ వాక్ నిర్మాణం పనులు పెండింగ్‌లో ఉన్నందున వెంటనే నిర్మించాలని నియోజకవర్గ వైస్సార్సీపీ సమన్వయ కర్త సాడి శ్యాం ప్రసాద్ రెడ్డి కోరారు. తదుపరి ప్రభుత్వం మారిన తర్వాత ఈ నిర్మాణం పనులు చేయకుండా సదరు కాంట్రాక్టర్ చేతులు దులుపుకున్నాడన్నారు. 2024 సంవత్సరం చివరిలో బహుదా నదికి వచ్చిన వరదలో వంతెనకు ఇరువైపులా అప్రోచ్ మార్గంలో పెద్ద గండి పడిందని, ఆ సమయంలో తాత్కాలికంగా మట్టితో పూడ్చిన పనులు చేపట్టి వదిలేశారన్నారు. భవిష్యత్తులో ఏ కొద్దిపాటి వరద వచ్చినా సరే వంతెనకు ఇరువైపులా మట్టితో ఏర్పాటు చేసిన అప్రోచ్ మార్గం కొట్టుకొని పోయే ప్రమాదం గలదని సంబంధిత అధికారులు కాంట్రాక్టు టర్మ్స్ ప్రకారం ఇరువైపులా మొత్తం 200 మీటర్ల రక్షణ కవచం నిర్మాణం పనులపై దృష్టి సారించి నిర్మాణం పూర్తి చేయాలని కోరారు.

# విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

**❋ ఐటీడీఏ ఏపీవో చిన్నబాబు**
**❋ టెక్కలి ఆసుపత్రిలో విద్యార్థినులకు పరామర్శ**



**మెళియాపుట్టి, ఆగస్టు 9 (వార్త):** విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై వివరాలు తెలుసుకుని వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, అనారోగ్య లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులకు సమాచారం అందించి తగిన చికిత్స అందించాలని ఐటీడీఏ ఏపీవో జి. చిన్నబాబు ఉపాధ్యాయులకు సిబ్బందికి సూచించారు. మండలంలో గల బందపల్లి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను ఐటీడీఏ ఏపీవో జి.చిన్నబాబు, డీడీ అన్నదొర ఆదివారం నాడు సందర్శించి పరిశీలించారు. అనారోగ్యంతో టెక్కలి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను ఏపీవో పరామర్శించారు. ఆసుపత్రికి వెళ్లి విద్యార్థులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితిని, యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఒక విద్యార్థిని విరేచనాల కారణంగా ఆసుపత్రిలో చేర్పించినట్లు తెలియపరచడంతో ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా మరో నలుగురు విద్యార్థులను వైద్య పరీక్షల నిమిత్తం ఆసుపత్రిలో చేర్పించి వైద్యుల పర్యవేక్షణలో ఉంచినట్లు చెప్పారు. ప్రస్తుతం విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని ఏపీవో తెలిపారు. అనంతరం బందపల్లి ఆశ్రమ పాఠశాలను సందర్శించిన ఏపీవో ఉపాధ్యాయులు, సిబ్బందితో మాట్లాడి పాఠశాల పరిసరాలను పరిశీలించిన ఆయన పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. ఆర్వో ప్లాంట్‌ను పరిశీలించి తాగునీటి నాణ్యతపై దృష్టి సారించాలని ఆదేశించారు. విద్యార్థుల కోసం సిద్ధం చేసిన భోజనాన్ని కూడా పరిశీలించి, నాణ్యత, పరిశుభ్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని సూచించారు. అలాగే వసతి గృహ గదులను పరిశీలించి విద్యార్థులతో నేరుగా మాట్లాడారు. వారి ఆరోగ్యం, వసతి సౌకర్యాలు, భోజనం తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అవసరమైన వైద్య సేవలు, పరిశుభ్రమైన తాగునీరు, నాణ్యమైన ఆహారం, పరిశుభ్రమైన వాతావరణం కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని పాఠశాల సిబ్బందికి సూచించారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని ఐటీడీఏ యంత్రాంగం నిరంతరం పర్యవేక్షిస్తోందని, అవసరమైన వైద్య సహాయం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. ఈ సంఘర్షణలో ఆయనతోపాటు సందర్శన లో ఆయనతోపాటు డిడి అప్పన్న దొర, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

## నాటక అకాడమీ డైరెక్టర్‌గా కామేశ్వరరావు ప్రమాణ స్వీకారం




**ఇచ్ఛాపురం ఆగస్టు 9 (వార్త):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్‌గా నియమితులైన దక్కత కామేశ్వరరావు విజయవాడలోని ఘంటసాల వెంకటేశ్వరరావు నాటక అకాడమీ కళా వేదికలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర సినిమాటోగ్రఫీ సాంస్కృతిక పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, ఏపీ నాటక అకాడమీ ఛైర్మన్ గుమ్మడి గోపాల కృష్ణలు ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాటక అకాడమీ డైరెక్టర్లు గణపతి, ప్రతిభ, గంగాదేవి , స్వప్న, దుర్గారావు, అంబికాదేవి, అన్నపూర్ణ, శివపార్వతి, లక్ష్మీ, ఐటీడీపీ మండల అధ్యక్షుడు నరేంద్ర రెడ్డి, కళాకారులు, సామాజిక సేవకులు పాల్గొని కామేశ్వరరావుకు శుభాకాంక్షలు తెలియజేశారు. నాటక రంగ అభివృద్ధికి ఆయన సేవలు మరింత ఉపయోగపడాలని ఆకాంక్షించారు.

## శాస్త్రీయ నృత్యంలో మెరిసిన చిద్విలాసిని

**పలాస, ఆగస్టు 9 (వార్త):** శాస్త్రీయ నృత్యంలో ప్రతిభ కనబరుస్తున్న పలాసకు చెందిన చిన్నారి తెప్పల చిద్విలాసిని 'బాలబాట' పురస్కారాన్ని కైవసం చేసుకున్నారు. విశాఖపట్నం పబ్లిక్ లైబ్రరీలో శనివారం నిర్వహించిన 'బాలబాట' మాసపత్రిక 19వ వార్షికోత్సవ వేడుకల్లో ఆమె శాస్త్రీయ నృత్య ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. ఆమె ప్రదర్శనకు విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా 'బాలబాట' సంపాదకురాలు స్వరాజ్యం వెంకట రమణమ్మ, విశిష్ట అతిథి, ప్రముఖ అచ్చతెనుగు రచయిత డా. జి.వి. పూర్ణచంద్, గౌరవ అతిథి కళారత్న డా. డి.వి. సూర్యారావు తదితరులు చిద్విలాసినిని శాలువా కప్పి, జ్ఞాపిక, ప్రశంసాపత్రంతో ఘనంగా సత్కరించారు.ప్రముఖ రచయిత, జనజాగృతి వ్యవస్థాపక అధ్యక్షులు లయన్ డా. తెప్పల కృష్ణమూర్తి మనుమరాలైన చిద్విలాసిని కళల పట్ల కుటుంబంలో ఉన్న ఆసక్తిని కొనసాగింపు పట్ల కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

## మెగా డీఎస్సీపై వైసీపీ రాజకీయాలు.. మానుకోవాలి

**❋ జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి కాళ్ళ జైదేవ్**



**ఇచ్ఛాపురం, ఆగస్టు 9 (వార్త):** మెగా డీఎస్సీ నియామకాలను రాజకీయ వేదికగా మార్చి నిరుద్యోగ యువతను రెచ్చగొట్టే ప్రయత్నం చేయడం బాధాకరమని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి కాళ్ళ జైదేవ్ పేర్కొన్నారు. డీఎస్సీ ప్రక్రియను అడ్డుకునేందుకు అనేక న్యాయపరమైన సవాళ్లు ఎదురయ్యాయని, వాటిని ప్రభుత్వం కోర్టుల్లో ఎదుర్కొని నియామక ప్రక్రియను కొనసాగించిందని ఆయన అన్నారు. ఇప్పుడు అదే అంశంపై రిలే నిరాహార దీక్షలు చేపట్టడం ప్రజలను తప్పు దోవ పట్టించే ప్రయత్నంగా కనిపిస్తోందని విమర్శించారు.స్పోర్ట్స్ కోటా నియా మకాల విషయంలో దాఖలైన పిటిషన్లపై కోర్టు చేసిన వ్యాఖ్యలు అందరికీ తెలుసని పేర్కొంటూ, రాజకీయ ప్రయోజనాల కోసం కోర్టులను ఆశ్రయించడం సరికాదనే సందేశం వెలువడిందని ఆయన అభిప్రాయపడ్డారు. ఒకవేళ నిజంగా ఏవైనా అవక తవకలు జరిగాయని ఎవరైనా భావిస్తే, చట్టబద్ధమైన ఆధారాలతో బాధితులు న్యాయపరంగా ముందుకు రావాలని సూచించారు.డీఎస్సీపై సీబీఐ విచారణ కోరు తున్న నాయకులు, ఇతర అంశాల్లో కూడా అదే ప్రమాణాన్ని పాటిస్తున్నారా అనే ప్రశ్నలకు సమాధానం చెప్పాలని జైదేవ్ అన్నారు. అసలు వైస్సార్సీపీ కి సీబీఐ అంటే గౌరవం ఉందా? వేల కోట్ల అవినీతి కేసులో పార్టీ అధినేత ఉంటే ఎందుకు సిబిఐ విచారణకి హాజరు కావడం లేదు? ఎందుకు వాయిదాల మీద వాయిదాలు వేస్తూ సిబిఐ ఎంక్వైరీకి సహకరించడం లేదు అనే సమాధానం చెప్పాలని అన్నారు. నిజంగా సిబిఐ మీద గౌరవం ఉంటే బాబాయి హత్య కేసును సీబీఐ ఎంక్వయిరీ కి ఎందుకు ఇవ్వలేదని, ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం, పెట్టుబడులు, ఉపాధి కల్పనపై దృష్టి సారించిన సమయంలో, యువత భవిష్యత్తుకు సంబం ధించిన డీఎస్సీ అంశాన్ని రాజకీయ వివాదంగా మార్చడం మంచిది కాదన్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు రావడం ప్రతి ఒక్కరి లక్ష్యం కావాలని, వారి భవిష్యత్తుతో రాజకీయాలు చేయకుండా నిర్మాణాత్మక సూచనలు చేయాలని వైఎస్సార్‌సీపీ నాయకులకు విజ్ఞప్తి చేస్తున్నామని కాళ్ళ జైదేవ్ తెలిపారు.

## సంతోష్ కుటుంబానికి పరామర్శ

**ఇచ్ఛాపురం ఆగస్టు 9 (వార్త):** మున్సిపాలిటీ పురుషోత్తపురం వైస్సార్సీపీ యువ నాయకులు వడ్డిన సంతోష్ కుమార్ (సంతు) లేని లోటు పూడ్చలేనిదని మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ పిలక రాజ్యలక్ష్మి అన్నారు. ఇటీవలి మృతి చెందిన సంతోష్ కుటుంబాన్ని పరామర్శించారు. తండ్రి జోగరావు కుటుంబ సభ్యులు ను ఓదార్చారు. మాజీ కౌన్సిలర్ సుగ్గు ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## శాంతినగర్‌లో ఎమ్మెల్యే గౌతు శిరీష పర్యటన



**పలాస, ఆగస్టు 9 (వార్త):** ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవడమే లక్ష్యంగా ఇంటింటి పర్యటన చేపట్టడం జరుగుతుందని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష స్పష్టం చేశారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని కాశీబుగ్గ శాంతినగర్‌లో ఆదివారం నిర్వహించిన 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి స్థానికులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు, అవసరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల వద్దకే పాలనలో భాగంలోని శాంతినగర్‌లో తాగునీరు, రహదారులు, డ్రైనేజీ, పారిశుధ్యం, వీధిలైట్లు తదితర సమస్యలను ఎమ్మెల్యే ఆరా తీశారు. స్థానికులు వివరించిన సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజల వద్దకే వెళ్లి సమస్యలు తెలుసుకోవడం ద్వారా వాటి పరిష్కారానికి మరింత సమర్థవంతంగా చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని గౌతు శిరీష తెలిపారు. సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, వాటి ద్వారా ప్రజలకు అందుతున్న ప్రయోజనాలను ఆమె వివరించారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. పథకాల అమలులో ఇబ్బందులు ఎదురైతే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. అర్హత ఉన్నప్పటికీ పథకాలు అందని కుటుంబాల వివరాలను తెలుసుకుని సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టి పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మౌలిక వసతుల కల్పన, పారిశుధ్యం, తాగునీటి సరఫరా, రహదారుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టి మున్సిపాలిటీని మరింత అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు కృషి చేయడం జరుగుతుందన్నారు. 'మీ సమస్య.. నా బాధ్యత'ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా వీలైనంత వరకు క్షేత్రస్థాయిలోనే సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రయత్నిస్తానని గౌతు శిరీష భరోసా ఇచ్చారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి అండగా నిలుస్తానన్నారు. నియోజకవర్గ అభివృద్ధితో పాటు ప్రతి కుటుంబ సంక్షేమమే తన ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఇంటింటి పర్యటనలో పలువురు మహిళలు, వృద్ధులు, యువకులు ఎమ్మెల్యేను కలిసి తమ సమస్యలను వివరించారు. వారి నుంచి వివరాలు తెలుసుకున్న గౌతు శిరీష సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ వార్డు ఇన్‌చార్జి చెల్లూరు రామకృష్ణ, ఏపిటిపిసి చైర్మన్ వజ్జ బాబురావు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ పిరికర్ల విఠల్‌రావు, టిడిపి బీసీ సెల్ కార్యదర్శి లోడగల కామేశ్వరరావు, మాజీ కౌన్సిలర్లు సూర్యనారాయణ, శ్రీకాంత్, ఆనందరావు, టిడిపి గాలి కృష్ణారావు, ఎం నరేంద్ర (చిన్ని), కృష్ణమూర్తి, సత్యం, కోరికన శంకర్రావు తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సంస్కృతి, సంప్రదాయాలతో ఆదివాసి దినోత్సవం

**❋ కొండలోగాంలో గిరిజనుల ఆధ్వర్యంలో పండగ వాతావరణం ❋ గిరిజన చట్టాలను అమలు చేయాలన్న ప్రజాసంఘాలు**



**మందస, ఆగస్టు 9(వార్త):** ప్రపంచ ఆదివాసీ దినోత్సవం దినోత్సవం సందర్భంగా మందస మండలంలోని కొండలోగాంలో ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలతో ప్రపంచ ఆదివాసిదినోత్సవం జరిగింది. గిరిజన శక్తి సంక్షేమ సంఘం, మానవ హక్కులు వేదిక, ఆంధ్ర ప్రదేశ్ రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. సమావేశంలో గిరిజనులు కొన్ని డిమాండ్స్ లను తీర్మానం చేసారు. రహదారులు, త్రాగునీరు, అటవీ భూములు సంరక్షించుట, గ్రానైట్ క్వారీ త్రవ్వకాలు గిరిజన ప్రాంతాలు అడవిపై నిలుపుదల చేయమని, సాగులో ఉన్న భూములకు పట్టాలు మంజూరు కల్పించాలని తీర్మానాలు చేసారు. అదేవిధంగా ఏపీ 2014 పునః విభజన తరువాత శ్రీకాకుళం జిల్లా ఎస్టీ నియోజక శాశనసభ స్థానం లేకుండా పోయిందని, ఐటీడీఏ ప్రాజెక్ట్ నిర్మాణం శ్రీకాకుళం జిల్లాలో మందస మండలం కేంద్రంగా స్థాపించాలన్నారు. ఎస్టీ గిరిజన ప్రాంతాలను ప్రత్యేకంగా నోడల్ ఏజెన్సీగా ప్రకటించాలని, షెడ్యూల్ ఏరియా గిరిజన ప్రాంతాలు, శ్రీకాకుళం జిల్లాను వెనుక బడిన ప్రాంతాలుగా గుర్తించి, సర్వే చేసి కమీషనర్ ల నియామకం చేయాలన్నారు. గిరిజన ఉద్యమ ప్రజాహిత శ్రీకాకుళం జిల్లా ఎస్.ఆర్. శంకరన్ కృషి భూబదలాయింపు యాక్ట 1/70 ను కొనసాగించాలని, ట్రైబల్ ఏరియాలో ప్రత్యేక డీఎస్సీ రిక్రూట్మెంట్ నియామకం చేయాలని, జీపీఎస్ టీడబ్ల్యు పాఠశాలల్లో 100% గిరిజన అభ్యర్థులనే నియామకం చేయాలన్నారు. ఆశ్రమ పాఠశాలల్లో ఎస్టీ సీఆర్టీ ఉపాధ్యాయలకు రెగ్యులర్ చేయాలని, ఐటీడీఏ బైలా, గురుకుల బైలా విద్యా సంస్థలు, గిరిజనులకే నిర్వహణకు నియామకం చేయాలని, షెడ్యూల్ ఉద్దేశ్యం హక్కులు నిర్వహించాలన్నారు. డబారుసింగ్ రిజర్వాయర్ నుండి కుడుమసాయి మెట్టు భూములకి లిఫ్ట్ ఇరిగేషన్ అమలు చేయాలని, దామోదర్ సాగర్ నుండి బలియగాం, కుసుమల, బంసుగాం గ్రామాలకు లిఫ్ట్ ఇరిగేషన్ అమలు చేయాలని, శ్రీకాకుళం జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించాలని, అటవీ హక్కులు చట్టం 2006 ప్రకారం ప్రతీ గిరిజన కుటుంబానికి మూడు ఎకరాలు డి.పట్టా, ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలను మంజూరు చేయించి, అటవీ హక్కులు చట్టాన్ని మరింత ప్రతిబంధకం అమలు చేయాలన్నారు. గిరిజన హక్కులు యాక్ట్ సంబంధించిన చట్టాలు, గిరిజనలకు అభివృద్ధి చెందిన జీఓలు కేవలం కాగితాలకే పరిమితం కాకుండా చేయాలని డిమాండ్ చేశారు. అంతకు ముందు సంస్కృతి, సంప్రదాయాలతో జరిగిన కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. గిరిజన బాలికలు చేసిన థింసా నాట్యం అలరించింది. కార్యక్రమంలో గిరిజన శక్తి సంక్షేమ సంఘం అధ్యక్షుడు సవర నరసింగరావు, జిల్లా మానవ హక్కుల వేదిక అధ్యక్షుడు సవర నారాయణరావు, ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం కామ్రేడ్ కోనేరు రమేష్, సవర నాగేశ్వరరావు, సవర జగ్గారావు, సవర మాధవరావు, సవర నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# సమాజహితం.. వాసుదేవం అభిమతం


* సరస్వతీపుత్రునిగా సమాజానికి సేవలు
* కవిగా మేలైన రచనలు * కుమారులు రవి, సూర్యం ఇద్దరూ.. ఇద్దరే * మట్ట వాసుదేవం సంతాపసభలో నివాళి * భైరిసారంగపురం హైస్కూల్ ఆవరణలో విగ్రహం ఆవిష్కరణ



**మందస, ఆగస్టు 9(వార్త):** ఆయనో సరస్వతీపుత్రుడు.. సమాజహితుడు.. చదువుల తల్లి ముద్దుబిడ్డ.. ఎందరినో ఉన్నతులుగా తీర్చిదిద్దిన మహానుభావుడు.. గొప్ప రచయిత.. చెప్పారంటే చేస్తారంతే. ఆయనే మట్ట వాసుదేవం. ఉపాధ్యాయునిగా, విద్యావేత్తగా, మండల విద్యాశాఖాధికారిగా, సమాజసేవకునిగా, కవి ఎంతో గుర్తింపు పొందారు. మందస మండలంలోని భైరిసారంగపురం అనే మారుమూల వెనుకబడిన ప్రాంతంలో జన్మించిన ఆయన మహోన్నతునిగా ఎదిగి.. అందనిలోకాలకు



వెళ్లిపోయారని పలువురు వక్తలు అన్నారు. ఉద్యోగ విరమణ చేసిన మట్ట వాసుదేవం మాస్టారు మరణించి.. ఏడాది దాటినా ఆయన జ్ఞాపకాలు మనతోనే ఉన్నాయని గుర్తు చేసుకున్నారు. మందస మండలంలోని భైరిసారంగపురం గ్రామానికి చెందిన వాసుదేవం మాస్టారి ప్రథమ వర్ధంతి సందర్భంగా భైరిసారంగపురంలో సంస్మరణ సభ జరిగింది. కార్యక్రమంలో ప్రముఖ డాక్టర్ ఎం.మల్లేశ్వరరావు మాట్లాడుతూ మట్ట వాసుదేవం ఉపాధ్యాయునిగా, మండల విద్యాశాఖాధికారిగా, సమాజసేవకునిగా, కవిగా తనదైన ఎంతో గుర్తింపు పొందారన్నారు. భైరిసారంగపురం హైస్కూలు నిర్మాణానికి స్థలదాతగా ఆయన కుటుంబం కూడా ఎంతో ఉదారతను చూపిందన్నారు. సమాజానికి ఉపయోగపడే మంచి పనులు ఆయన చేశారని కొనియాడారు. కవి బమ్మిడి సుబ్బారావు మాట్లాడుతూ వాసుదేవం చేసిన సేవలను అభినందించారు. అటువంటి వ్యక్తులకు సమాజానికి ఎంతో అవసరమన్నారు. వాసుదేవం మరణం తీరనిలోటన్నారు. ఈ సందర్భంగా బీఎస్ పురం హైస్కూలు ఆవరణలో మట్ట వాసుదేవం విగ్రహం ఆవిష్కరించారు. అంతకు ముందు సంస్మరణ సభను జ్యోతి ప్రజ్వలనకావించి డాక్టర్ ఎం.మల్లేశ్వరరావు ప్రారంభించారు. వేదికపై డాక్టర్ మల్లేశ్వరరావును ఘనంగా సన్మానించారు. అదే సభలో వాసుదేవం రచించిన అక్షర కచ్ఛపి గేయసంపుటిని ఆవిష్కరించారు. అదే విధంగా ఆయన రచించిన మరో పుస్తకమైన యాదవ భారతంను కూడా గుర్తు చేశారు. ఈ సందర్భంగా వాసుదేవం పెద్ద కుమారుడు వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ డిప్యూటీ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ మట్ట రవికృష్ణ మాట్లాడుతూ తీవ్ర ఉద్వేగానికి గురయ్యారు. వాసుదేవం కొడుకుగా పుట్టడం అదృష్టమని, మళ్లీ జన్మ ఉంటే ఆయన కుమారునిగా పుట్టాలని ఆకాంక్షించారు. చిన్న కుమారుడు ఉపాధ్యాయుడు డాక్టర్ మట్ట సూర్యం మాట్లాడుతూ ఎందరికో ఆదర్శంగా తన తండ్రి మారారని, ఆయన కుమారునిగా జన్మించడం పూర్వ జన్మ సుకృతమన్నారు. అనంతరం అన్నదానం కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో గొర్లె సాంబమూర్తి, అంపోలు త్రినాథరావు, వాయలపల్లి నారాయణరావు, గొర్లె కామరాజు, బాలక చిట్టిబాబు, కె.పాపారావు, కోదండరావు, పి.లక్ష్మణరావు, ఎస్.సోమనాథ్, నాయకులు మట్ట మాధరావు, షణ్ముఖరావు, మురపాల నారాయణరావు, పాలిన శ్రీనివాసరావు, లొడగల కామేశు, ఉంగ సాయి, దాసరి తాతారావు తదితరులు పాల్గొని ప్రసంగించారు.



## జావెలిన్ త్రోలో దుర్గా భరత్ ప్రతిభ

**సారవకోట, ఆగస్టు 9(వార్త):** శ్రీకాకుళం జిల్లా స్థాయిలో నిర్వహించిన జావెలిన్ త్రో పోటీల్లో సారవకోట మండలం తర్లి ఆశ్రమ పాఠశాల విద్యార్థి దుర్గా భరత్ ప్రతిభ కనబరిచాడు. అమరావతి ఛాంపియన్ పోటీల్లో భాగంగా నిర్వహించిన జావెలిన్ త్రో విభాగంలో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానాన్ని సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ విషయాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ధనుంజయరావు తెలిపారు. జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానాన్ని సాధించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. దుర్గా భరత్ రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ ప్రతిభ కనబరిచి పాఠశాలకు, సారవకోట మండలానికి మంచి పేరు తీసుకురావాలని ప్రధానోపాధ్యాయులు ఆకాంక్షించారు. విద్యార్థి ప్రతిభను అభినందిస్తూ ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు శుభాకాంక్షలు తెలిపారు.

## యోగాలో జగదీష్ ప్రతిభ

**ఇచ్ఛాపురం, ఆగస్టు 9 (వార్త):** చెన్నైలో ఆదివారం జరిగిన సౌత్ ఇండియా యోగాసన ఛాంపియన్‌షిప్ పోటీల్లో శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం పట్టణానికి చెందిన పాలేపు సాయి జగదీష్ సత్తా చాటాడు. 13 నుంచి 16 ఏళ్ల వయస్సు విభాగంలో పోటీల్లో పాల్గొన్న సాయి జగదీష్ నాలుగు పతకాలను సాధించాడు.యోగ ట్విస్టింగ్ విభాగంలో స్వర్ణ పతకం, యోగ ఫార్వర్డ్ బెండింగ్‌లో రజత పతకం, యోగ స్టాండింగ్‌లో రజత పతకం, బ్యాక్‌వర్డ్ బెండింగ్‌లో కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నాడు. విభిన్న యోగాసన విభాగాల్లో ప్రతిభ కనబరిచి మొత్తం నాలుగు పతకాలు సాధించడం పట్ల సాయి జగదీష్‌ను పలువురు అభినందించారు. బెంగళూరుకు చెందిన పర్సనల్ యోగా కోచ్ శిల్పా శెట్టి, కోచ్ శ్రీకాంత్ సాయి జగదీష్‌ను ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో రాణించాలని ఆకాంక్షించారు.

## భగవద్గీత పారాయణంతో మానసిక ప్రశాంతత

**పోలాకి, ఆగస్టు9 (వార్త):** చింతాడపేటలోని రామయోగి బాబా సేవాశ్రమంలో ఆదివారం ఆధ్యాత్మిక సత్సంగ సభను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ ప్రవచనకారులు, "చిక్కోలు చాగంటి" బిరుదాంకితులు ఇప్పిలి రామ కృష్ణశర్మ ఆధ్యాత్మిక విషయాలపై ప్రవచనం చేశారు. నిత్యం భగవద్గీత పారాయణం చేయడంతో పాటు పెద్దలు, గురువుల బోధనలు వినడం వల్ల మనసుకు ప్రశాంతత చేకూరుతుందని రామకృష్ణశర్మ పేర్కొన్నారు. ఆధ్యాత్మిక చింతన, సత్సంగం ద్వారా మనిషిలో సానుకూల ఆలోచనలు పెంపొందుతాయని, జీవితంలో ఎదురయ్యే సమస్యలను ధైర్యంగా ఎదుర్కొనే మానసిక స్థైర్యం లభిస్తుందని వివరించారు. బమ్మిడి విశ్వనాథం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రవచనకారులు, భక్తులు, ఆధ్యాత్మిక అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భక్తుల భజనలు, ఆధ్యాత్మిక ప్రసంగాలతో సేవాశ్రమం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది.

## మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి

**పోలాకి, ఆగస్టు 9(వార్త):** యువత వివిధ రకాల మత్తు పదార్థాలకు బానిస లుగా మారకుండా అప్రమత్తంగా ఉండాలని పోలాకి ఎస్ఐ రంజిత్ సూచించారు. మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై యువత అవగాహన పెంచుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. శనివారం రాత్రి పోలాకి మండలం జడూరు జాతీయ రహదారి వద్ద పోలీసుల ఆధ్వర్యంలో 'యువతకు అభయం' పేరిట అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రంజిత్ మాట్లాడుతూ, యువత చెడు వ్యసనాలకు లోనై తమ భవిష్యత్తును నాశనం చేసుకోకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. జడూరు పరిసర ప్రాంతాల్లో మద్యం విక్రయాలతో పాటు పలు రకాల మత్తు పదార్థాల విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం ఉందని ఆయన తెలిపారు. యువత మత్తు పదార్థాల వైపు ఆకర్షితులు కాకుండా వాటికి పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. మత్తు పదార్థాల వినియోగం వ్యక్తిగత ఆరోగ్యంతో పాటు కుటుంబం, సమాజంపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. యువత తమ సమయాన్ని విద్య, ఉపాధి, క్రీడలు, నైపుణ్యాభివృద్ధి వంటి సానుకూల కార్యక్రమాల వైపు మళ్లించాలని ఎస్ఐ రంజిత్ సూచించారు. మత్తు పదార్థాల విక్రయాలు లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం ఉంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలని, యువతను వాటి బారిన పడకుండా రక్షించేందుకు పోలీసుల తరఫున అవగాహన కార్యక్రమాలు కొనసాగిస్తామని ఆయన తెలిపారు.

## నరసన్నపేటను స్వచ్ఛ పంచాయతీగా తీర్చిదిద్దాలి

**నరసన్నపేట, ఆగస్టు 9 (వార్త):** నరసన్నపేట మేజర్ పంచాయతీని స్వచ్ఛ పంచాయతీగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఇన్‌ఛార్జ్ ఈవో జగన్మోహనరావు సూచించారు. ఆదివారం నరసన్నపేటలో కొనసాగుతున్న పారిశుద్ధ్య పనులను ఆయన స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పంచాయతీ పరిధిలోని పలు ప్రాంతాల్లో పారిశుద్ధ్య పరిస్థితులను పరిశీలించిన ఆయన, వ్యర్థాలు పేరుకుపోయిన ప్రాంతాలను గుర్తించి వాటిని తక్షణమే తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రధానంగా ప్రజల రాకపోకలు అధికంగా ఉండే ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పంచాయతీ పరిధిలో పారిశుద్ధ్యంపై ప్రజల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా సిబ్బంది నిరంతరం పర్యవేక్షించాలని జగన్మోహనరావు తెలిపారు. ప్రజల నుంచి ఫిర్యాదులు వచ్చిన పక్షంలో వాటిపై తక్షణమే స్పందించి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. నరసన్నపేటను పరిశుభ్రంగా, ఆరోగ్యకరమైన వాతావరణంతో కూడిన స్వచ్ఛ పంచాయతీగా తీర్చిదిద్దేందుకు అధికారులు, సిబ్బందితో పాటు ప్రజలు కూడా సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

## న్యాయ సేవలపై అవగాహన

**ఇచ్ఛాపురం, ఆగస్టు 9 (వార్త):** జాతీయ చట్టపరమైన సేవల అధికారం దేశం కోసం మధ్యవర్తిత్వ ప్రచారం 3.0 సంబంధించి కోర్టు నుంచి బస్టాండ్ మీదుగా మార్కెట్ జంక్షన్ వరకు పాదయాత్రను కొనసాగించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల లీగల్ సర్వీస్ ఛైర్మన్, న్యాయమూర్తి కె.శ్రీనివాసరావు విచ్చేసి పాదయాత్రను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సివిల్ రాజీకి వీలున్న క్రిమినల్ కేసులను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇచ్ఛాపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం. చిన్నమనాయుడు, పట్టణ సబ్ ఇన్స్పెక్టర్ ముకుంద రావు , రూరల్ ఇన్స్పెక్టర్ జనార్ధన్ రావు దక్కత కృష్ణమూర్తి రెడ్డి ఇచ్ఛాపురం కోర్ట్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు నందికి రమణయ్య రెడ్డి, సెక్రటరీ ఎం. రాంబాబు, వైస్ ప్రెసిడెంట్ ప్రేమ లత పట్నాయక్, ట్రెజరర్ ఆర్.దేవరాజ్ రెడ్డి, న్యాయవాదులు గిన్ని సీతయ్య రెడ్డి, ఏ. బైరాగిరెడ్డి, రాజేంద్ర ప్రసాద్, భగవాన్ దాస్, సింహాద్రి లక్ష్మి నారాయణ, బి. జి. గోవింద్, తరుణ్, భీమా రావు , జగ్గారావు రెడ్డి, మనోజ్ కుమార్ సామాంతో, బి. సూర్య నారాయణ, యన్. యస్. వి. రంగారావు, యం. మోహనరావు, మురళి బెహరా, ప్రసాద్,కోర్ట్ సిబ్బంది, పోలీస్ సిబ్బంది, ఆటో యూనియన్స్ పాల్గొన్నారు.

## నోటరీ సేవలు ఉచితం

**ఇచ్ఛాపురం ఆగస్టు9(వార్త):** నిరుపేదలకు నోటరీ సేవలు ఉచితంగా అందిస్తామని ప్రముఖ సీనియర్ నాయవాది అల్లాడ నారాయణ రావు చెప్పారు. ఎటువంటి మధ్యవర్తిత్వం లేకుండా నేరుగా వచ్చే పార్టీలకు మాత్రమే సేవలు ఉచితం అని చెప్పారు. విదేశాలకు వెళ్లే వలస కార్మికులుకి డాక్యుమెంటేషన్ అట్టేసెస్టన్ కూడా ఉచితం అని చెప్పారు. ప్రతి రోజు 2 నుండి 4 వరకు ఉచిత న్యాయ సలహాలు అందిస్తామని చెప్పారు. పూర్తి వివరాలకి చిన్న దేవరవీధి మొబైల్ నెంబర్ 9440661201 కి సంప్రదించాలని కోరారు.



## సమీరాకు ప్రతిభా పురస్కారం

**సోంపేట ఆగస్టు 9 (వార్త):** జింకిభద్ర గ్రామానికి చెందిన విద్యార్థిని బత్తుల సమీరాకు విశాఖ జిల్లా దేవాంగ సంక్షేమ సంఘం ప్రతిభ పురస్కారాన్ని అందించింది. సమీరా గత ఏడాది పదో తరగతి పరీక్షల్లో 587 మార్కులు సాధించి ఉత్తమ ప్రతిభ సాధించింది. ఈ మేరకు ఆదివారం విశాఖపట్నంలో అందించిన ప్రతిభా పురస్కారాన్ని సమీరా అందుకున్నారు. దేవాంగ సామాజిక వర్గంలో పేద కుటుంబంలో పుట్టి చదువుల్లో మంచి ప్రతిభ పాఠవాలు ప్రదర్శిస్తున్న సమీరాను అనేకమంది అభినందించారు. భవిష్యత్తులో ఉన్నత విద్యలో మరిన్ని విజయాలు సాధించి అత్యున్నత స్థాయికి ఎదగాలని అందరూ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జింకిభద్ర దేవాంగ సంక్షేమ సంఘం సమీరాకు అభినందనలు తెలిపింది.

# అప్పలరాజుపై అక్రమ కేసులను ఖండించాలి

* మత్స్యకార ఐక్యవేదిక ఆధ్వర్యంలో శ్రీదేవికి సంఘీభావం * మత్స్యకారుల ఐక్యతను చాటుతాం: మత్స్యకారుల నాయకులు

**పలాస, ఆగస్టు 9 (వార్త):** మాజీ మంత్రి, మత్స్యకార నాయకుడు డాక్టర్ సీదిరి అప్పలరాజుపై పెట్టిన కేసులు, అరెస్టును ఖండిస్తూ జిల్లా నలుమూలల నుంచి వివిధ మత్స్యకార గ్రామాలకు చెందిన నాయకులు, ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పలాసకు తరలివచ్చారు. ఆయన సతీమణి సీదిరి శ్రీదేవిని కలిసి సంఘీభావం తెలిపారు. మత్స్యకార నాయకుడిగా అప్పలరాజు ఎదుగుదలను, ఆయన చేసిన అభివృద్ధిని ఓర్వలేకే రాజకీయ దురుద్దేశంతో కేసులు పెట్టి జైలుకు పంపించారని మత్స్యకార నాయకులు మండిపడ్డారు. మత్స్యకార ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఉప్పరపల్లి ఉదయకుమార్, పుక్కల గురయ్యానాయుడు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మత్స్యకార కులాలన్నింటినీ ఐక్యం చేసి, రానున్న రోజుల్లో అప్పలరాజు వెంట నడుస్తామని వారు తెలిపారు. ఆయనపై జరుగుతున్న పరిణామాలపై రాష్ట్రస్థాయిలో మత్స్యకార గ్రామాలను సందర్శించి ప్రజలకు వివరిస్తామని నాయకులు వెల్లడించారు. సీదిరి శ్రీదేవి మాట్లాడుతూ డాక్టర్ వృత్తిలో ఉన్న సమయంలో తన భర్త ఎంతోమంది ప్రాణాలను కాపాడారని, అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారని తెలిపారు. ఆసుపత్రికి వచ్చే వారిలో కిడ్నీ సమస్యలతో బాధపడుతున్న మత్స్యకారులు అధికంగా ఉండేవారని చెప్పారు. వారి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలనే ఉద్దేశంతో రాజకీయాల్లోకి వచ్చారని వివరించారు. అప్పలరాజు ఎమ్మెల్యేగా గెలిచిన అనంతరం అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఒప్పించి కిడ్నీ ఆసుపత్రి నిర్మాణానికి కృషి చేశారని తెలిపారు. మత్స్యకారులు తన భర్తపై చూపుతున్న ఆదరాభిమానాలను జీవితాంతం మరువలేమన్నారు. అందరి ఆశీస్సులతో డాక్టర్ అప్పలరాజు త్వరలో విడుదల అవుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఐక్యవేదిక నాయకుడు అంబటి ఆనందరావు మాట్లాడుతూ ప్రతి మత్స్యకార గ్రామంలో గంగమ్మ తల్లి పూజల సందర్భంగా అప్పలరాజుపై జరిగిన అన్యాయం, ఆయనపై జరుగుతున్న ప్రచారం గురించి ప్రజలకు వివరిస్తామని తెలిపారు. తమ నాయకుడిపై జరుగుతున్న విష ప్రచారాన్ని తిప్పికొడతామని స్పష్టం చేశారు. న్యాయవాది మూగి గురుమూర్తి మాట్లాడుతూ తన వృత్తిలో ఎన్నో కేసులను చూశానని, అయితే ఇలాంటి పరిణామాలను చూడలేదన్నారు. ఒక మత్స్యకార నాయకుడు ఎదుగుతున్న సమయంలో ఆయనను అణచివేసేందుకు తప్పుడు కేసులు పెట్టడం సరికాదని పేర్కొన్నారు. మత్స్యకారులంతా ఐక్యంగా పోరాడుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డొంక విద్యాసాగర్, ఎస్.వెంకన్న, తిర్రి రాజారావు తదితరులు పాల్గొన్నారు.




## అన్నప్రసాదాలకు రూ.20వేలు వితరణ



**మెళియాపుట్టి, ఆగస్టు 9 (వార్త):** పాతపట్నం నీలమణి దుర్గ అమ్మవారు దేవాలయంలో సోమవారం నిర్వహించనున్న అన్నప్రసాదాలకు బిజెపి పార్టీ నాయకులు, డాక్టర్ సలాన శరత్ కుమార్ 20 వేలు రూపాయలును వితరణగా ఆదివారం అందజేశారు. సోమవారం ఉదయం 11:30 గంటల నుండి అమ్మవారి ఆవరణలో జరుగు శాకంబరీదేవి ప్రసాదాన్ని అన్నప్రసాదంగా స్వీకరించి తరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ అక్కంద్ర సన్యాసిరావు, పట్టణ పార్టీ అధ్యక్షులు సైలాడ సతీష్, ఏపీ స్టేట్ కళింగ వైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ శాసనపురి మధుబాబు, యూనిట్ సభ్యులు బోడ చందు, ప్రశాంత్ కుమార్ పాడి, ఆలయ అధికారులు సుదర్శన, సభ్యులు, భక్తులు తదితరులు ఉన్నారు.

## రోబరీ కేసులో నలుగురు అరెస్టు



**మందస, ఆగస్టు 9(వార్త):** మందస మండలం వీరభద్ర గ్రామంలో గతనెల 31న రాత్రి సుమారు 8:15 గంటల సమయంలో జరిగిన దాడి, రోబరీ కేసులో నలుగురు నిందితులను మందస పోలీసులు అరెస్ట్ చేసినట్లు కేసు వివరాలు కాశీబుగ్గ డీఎస్పీ టి భవాని తెలిపారు. ఆదివారం సబ్ డివిజన్ కార్యాలయంలో నిర్వహించిన పత్రిక సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. గతనెల 31న రాత్రి ఫిర్యాదుదారు ఇప్పిలి రాఘవరావు తన భార్యతో కలిసి దత్తాత్రేయ స్వామి ఆలయాన్ని దర్శించుకుని ఇంటికి తిరిగి వచ్చారు. ఇంటి గేటు వద్ద ఫిర్యాదుదారు వాహనంపై కూర్చుని ఉండగా, ఆయన భార్య ఇప్పిలి స్వర్ణలత ఇంటి గేటు తీస్తున్న సమయంలో ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తులు ఫిర్యాదుదారుపై చేతులు, కాళ్లతో దాడి చేసి గాయపరిచారు. తన భర్తపై ఎందుకు దాడి చేస్తున్నారని స్వర్ణలత ప్రశ్నించగా, నిందితులు ఆమెను భయపెట్టి పక్కకు నెట్టివేసి, ఆమె మెడలో ఉన్న గొలుసును లాక్కొని అక్కడి నుంచి పరారయ్యారు. అదే రోజు రాత్రి పదిగంటలకు మందస పోలీస్ స్టేషన్‌లో బాధితుల ఫిర్యాదు మేరకు చైన్ స్నాచింగ్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అనంతరం ప్రాథమిక దర్యాప్తు ఆధారంగా రోబరీ కేసుగా ఆల్టర్ చేశారు. యానాది జ్యోతి రాజు, చీకటి అభిరామ్, గురుబిల్లి అనిల్ కుమార్, ఇప్పిలి వివేక్‌లను పోలీసులు అరెస్టు చేశారని డీఎస్పీ తెలిపారు. హరిపురం గ్రామంలోని ఎస్‌బీఐ బ్యాంకు ఎదురుగా ఉన్న ప్రధాన రహదారి వద్ద ముగ్గురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. ఈ కేసులో నలుగురు నిందితులను అరెస్ట్ చేసి, తదుపరి న్యాయపరమైన చర్యల నిమిత్తం రిమాండ్‌కు తరలించారు.

## ఘనంగా నియోజకవర్గ సాయి క్విజ్ పోటీలు

**పలాస, ఆగస్టు 9 (వార్త):** శ్రీ రామకృష్ణ సేవా సంఘం, పలాస ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి సాయి క్విజ్, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు ఆదివారం నిర్వహించారు. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. క్విజ్‌లో బొడ్డపాడుకు ప్రథమ స్థానంక్విజ్ పోటీల్లో మొత్తం 67 జట్లు పాల్గొన్నాయి. వీటిలో జడ్పీహెచ్ఎస్ బొడ్డపాడు జట్టు ప్రథమ స్థానం సాధించింది. జడ్పీహెచ్ఎస్ యర్రముక్కం ద్వితీయ స్థానం, శ్రీ సాయి హైస్కూల్ జట్టు తృతీయ స్థానంలో నిలిచాయి.వక్తృత్వంలో తేజశ్వని ప్రతిభవక్తృత్వ పోటీల్లో జడ్పీహెచ్ఎస్ కాశీబుగ్గ విద్యార్థిని తేజశ్వని పాత్రో ప్రథమ బహుమతి సాధించారు. జడ్పీహెచ్ఎస్ టెక్కలిపట్నం విద్యార్థిని ఆర్. ధరణి ద్వితీయ బహుమతి, జడ్పీహెచ్ఎస్ కాశీబుగ్గ విద్యార్థిని టి. ప్రవళిక తృతీయ బహుమతి పొందారు. వ్యాసరచన పోటీల విజేతలను త్వరలో ప్రకటించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆగస్టు 15న బహుమతుల ప్రదానంపోటీల్లో విజేతలకు ఆగస్టు 15న బహుమతులు ప్రదానం చేయనున్నట్లు శ్రీ రామకృష్ణ సేవా సంఘం అధ్యక్షుడు శ్రీ పాండురంగారావు తెలిపారు. విద్యార్థుల్లో ఆధ్యాత్మిక, నైతిక విలువలతో పాటు సృజనాత్మకత, వక్తృత్వ నైపుణ్యాలను పెంపొందించేందుకు ఇటువంటి పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.



## 1990 పోలీస్ బ్యాచ్ ఆత్మీయ కలయిక



**శ్రీకాకుళం, ఆగస్టు 9 (వార్త):** 1990 బ్యాచ్ కానిస్టేబుళ్ల ఆత్మీయ కలయిక కార్యక్రమం శ్రీకాకుళంలో కుటుంబ సభ్యులతో కలిసి ఘనంగా నిర్వహించారు. 1990లో అప్పటి శ్రీకాకుళం జిల్లా ఎస్పీ బాబ్జీ 51 మంది కానిస్టేబుళ్లను ఎంపిక చేసి శిక్షణ అందించారు. అప్పటి నుంచి వివిధ హోదాల్లో విధులు నిర్వహిస్తూ 90 బ్యాచ్ సభ్యులు 37 ఏళ్ల సర్వీసు ప్రయాణాన్ని పూర్తి చేసుకున్నారు. ప్రతి ఏడాది కుటుంబ సభ్యులతో కలిసి ఆత్మీయ కలయిక నిర్వహించుకోవడం ఆనవాయితీగా కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా బ్యాచ్ సభ్యుల మధ్య ఆత్మీయతను మరింత బలోపేతం చేసుకోవడంతో పాటు, ఏ సభ్యుడికైనా లేదా వారి కుటుంబానికి ఏదైనా సమస్య ఎదురైతే బ్యాచ్ తరఫున అన్ని విధాలా అండగా నిలవాలని నిర్ణయించారు. ఇకపై కూడా ప్రతి సంవత్సరం ఇదే విధంగా బ్యాచ్ మీట్ నిర్వహించాలని నిర్ణయించారు. ఈ ఏడాది పదవీ విరమణ చేసిన నలుగురు 90 బ్యాచ్ సభ్యులు జిన్నారావు, బి.వి. సత్యనారాయణ, రెల్ల కూర్మారావు, కనకరాజులను వారి కుటుంబ సభ్యులతో కలిసి ఘనంగా సన్మానించారు. వారి సుదీర్ఘ సేవలను గుర్తుచేసుకుని అభినందనలు తెలిపారు. కార్యక్రమాన్ని పి. శ్రీనివాసరావు, నారాయణరావు, విజయ్‌కుమార్, నర్సింగరావు సమన్వయంతో విజయవంతంగా నిర్వహించారు. కుటుంబ సభ్యుల సమక్షంలో జరిగిన ఈ ఆత్మీయ కలయికలో పాత జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ సభ్యులు ఆనందాన్ని పంచుకున్నారు.

## ఐదు పదుల వయస్సులో ఆత్మీయ సమ్మేళనం

**ఇచ్ఛాపురం, ఆగస్టు 9(వార్త):** వారంతా 50 ఏళ్లు పై బడిన వారు. కాసేపు వయస్సు మరిచి కేరింతలు కొట్టారు. సుమారు 35 ఏళ్ల తర్వాత వారంతా కలుసుకున్నారు. అప్పటి మధుర స్మృతులను స్మరించుకున్నారు. 1990-91లో 10వ తరగతి బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయకలయికలో సున్నాపురం బీచ్ ఆవరణలో ఆత్మీయ సమ్మేళనం చేసుకున్నారు.



## 'చిరు' సేవలకు సత్కారం

**ఇచ్ఛాపురం ఆగస్టు 9 (వార్త):** తూర్పుగోదావరి జిల్లా కాకినాడలో జరిగిన ఇంపాక్ట్ క్లబ్ ఇంటర్నేషనల్ జాతీయ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో ఐసిఐ ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ జాతీయ ఉపాధ్యక్షునిగా గత నాలుగు నెలలుగా అందిస్తున్న విశేష సేవలకు గాను ప్రత్యేక ప్రశంసా పత్రంతో పల్లంటి చిరంజీవిని సత్కరించారు. గత నాలుగు నెలలుగా 4,16 రీజియన్లకు చెందిన శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలతో పాటు విజయవాడ కృష్ణ గుంటూరు బాపట్ల జిల్లాలలో శిక్షణ కార్యక్రమాలు, మోటివేషన్ తరగతులు, ఐసిఐ క్లబ్బుల ఏర్పాటు , ఎఫెక్టివ్ పబ్లిక్ స్పీకింగ్ తరుగుతుల నిర్వహణ విద్యార్థులకు ప్రేరణాత్మకమైన సందేశాలు అందిస్తూ, యువతలు నాయకత్వపు లక్షణాలను పెంపొందిస్తూ చేస్తున్న సేవలకు గాను జాతీయ అధ్యక్షులు డాక్టర్ ఆర్ వెంకటేశ్వరరావు, కార్యదర్శి మారోజు రమేష్ కుమార్ కోశాధికారి సుదర్శన్, తాజా మాజీ జాతీయ అధ్యక్షురాలు కే మాధవి మాజీ జాతీయ అధ్యక్షులు సోను శ్రీనివాస్ తదితరులు ప్రశంసా పత్రంతో ఘనంగా సన్మానించారు.

## రెండేళ్ల పాలనపై ఇంటింటి ప్రచారం



**ఆమదాలవలస, ఆగస్టు 9 (వార్త):** కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించేందుకు కింతలి గ్రామంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు విస్తృతంగా ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూన ప్రమీల పాల్గొని ప్రజలకు కూటమి ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఇంచార్జ్, జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యదర్శి సీపాన శ్రీరంగ నాయకులు, కింతలి గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ఆదివాసీలకు హక్కులు కల్పించండి

**మందస, ఆగస్టు 9(వార్త):** ఆదివాసి దినోత్సవ సంబరాలు కాదు.. ఆదివాసీలకు హక్కులు కల్పించాలని ఏపీ ఆదివాసి సంఘం నాయకులు, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మందస మండలంలోని కిల్లోయికాలనీ, బుడంబో, లొడకపిట్ట, సందూరు గ్రామాల్లో విస్తృత ప్రచారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అడవులను నమ్ముకొని జీవితం కొనసాగిస్తున్న మూలవాసులకు అదే అడవులను నుండి తరిమేయడానికి ప్రయత్నాలు చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ దేశంలో ఉన్న పెట్టుబడుదారులకు గనులు పేరుతో, సంపదలు పేరుతో అదానీ,అంబానీలకు కారు చౌకగా ఛత్తీస్గఢ్, జార్ఖండ్, ఒరిస్సా లాంటి రాష్ట్రంలోని గిరిజన భూములను స్వాధీనం చేసుకున్న విధానాలకు సిపిఐ యంయల్ లిబరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యులు మద్దిల రామారావు ఖండించారు. మందస మండలాన్ని 5షెడ్యూల్ ల్లో కలపాలని డిమాండ్ చేసారు. 1/70 చట్టాన్ని రద్దు పరిచే ఆలోచనని విరమించుకోవాలన్నారు. ఆదివాసీలకు సంపూర్ణ హక్కులు కల్పించిన రోజునే ఆదివాసీ దినోత్సవ వేడుకలకు అర్థం ఉంటుందన్నారు. అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఆదివాసీలందరికి వారు ఆదివాసీ దినోత్సవ శుభాకాంక్షలను ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ సంఘం తరుపున శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు రామారావు, ఐప్వా నాయకులు కోనారి ఈశ్వరమ్మ, కోదండం, సింహాద్రి, రవి, బాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546